శంబర పోలమాంబ సిరిమాను సంబరంలో జనవాహిని (ఇన్‌సెట్లో) అమ్మవారు



సాక్షి శ్రీకాకుళం

బుధవారం। 29। జనవరి। 2025

మందుల చీటీ కావాలంట



ఈ చిత్రంలో కనిపిస్తున్న మానసిక వికలాంగుడి పేరు బమ్మిడి నిత్యానంద. వీరిది ఆమదాలవలస మండలం లక్ష్ముడు పేట. చిన్నప్పటి నుంచి మానసిక పరిస్థితి బాగోలేదు. అప్పటి నుంచి మానసిక వికలాంగుడిగా పింఛను తీసుకుంటున్నారు. ఇప్పుడాయన్ని పెద్దాస్పత్రికి వెళ్లి కాగితం తెచ్చుకోమన్నారు. ఇక్కడికి వస్తే పాత మందులు చీటీ అడిగారు. ఎప్పుడో చిన్నప్పుడు వాడిన చీటీ ఇప్పుడు వారి దగ్గర లేదు. దీంతో పరీక్షలు చేయకుండానే వెనక్కి పంపించేశారు.



తొమ్మిదేళ్లుగా పింఛను వస్తోంది..



నాకు 2013లో పక్షవాతం వచ్చింది. ఆ తర్వాత ఫింఛను కోసం దరఖాస్తు చేసుకోగా తొమ్మిదేళ్ల కిందట ఫింఛను మంజూరైంది. ఇప్పటివరకు అందుతోంది. ఇప్పుడు పున:పరిశీలన పేరుతో పత్రాలన్నీ తీసుకు రమ్మన్నారు. నా కుమారుడి సాయంతో వచ్చాను. **- దువ్వారపు తవిటినాయుడు, నెయ్యిలవీధి, నరసన్నపేట.**

సచివాలయంలోనే పరిశీలిస్తే బాగుండేది



నాకు దివ్యాంగ ఫింఛను రూ.500 ఉన్నప్పటి నుంచి వస్తోంది. మళ్లీ ఇప్పుడు పున:పరిశీలన అంటూ రమ్మన్నారు. పత్రాలన్నీ చూపించాను. ఈ పరిశీలన గ్రామ సచివాలయంలోనే చేసి ఉంటే మాకు ఇబ్బంది ఉండేది కాదు.

– గొద్దు సన్యాసి, తామరాపల్లి, నరసన్నపేట మండలం

నడవలేని స్థితిలో

ఈ చిత్రంలో బైక్‌పై నుంచి కిందకు దిగుతున్న పిల్లాడి పేరు అనూష్‌కుమార్. వీరిది కొత్తూరు మండలం దొండమాను గూడ. నడవలేని స్థితిలో ఉన్న దివ్యాంగుడు. తల్లిదండ్రులు కలిపి దించితే తప్ప దిగలేని పరిస్థితి వారిది. పదేళ్లుగా దివ్యాంగ పింఛను వస్తోంది. ఇప్పుడా పిల్లాడిని సదరంలో పునః పరిశీలన చేసుకోమని చెప్పడంతో పాతపట్నం సీహెచ్‌సీకి తీసుకొచ్చారు. ఆ పిల్లాడితో పాటు తల్లిదండ్రులకు పాట్లు తప్పలేదు.



వీల్‌చైర్లలో వచ్చిన వారు కొందరు.. బంధువుల సాయంతో వచ్చిన వారు మరికొందరు.. కళ్లు కనిపించకపోయినా ఊళ్లు దాటి వచ్చిన వారు ఇంకొందరు.. టీ చుక్క పోసే దిక్కు లేదు. కనీసం మంచినీళ్లు ఇచ్చే నాథుడు లేదు. వైకల్య పరీక్షల కోసం ఆస్పత్రులకు వస్తున్న దివ్యాంగులు నరకయాతన పడుతున్నారు. 'వైకల్యం ఉంటే సరిపోదు.. దాన్ని రుజువు చేసుకోండి..' అని ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తుండడంతో వీరికి యాతన తప్పడం లేదు. పింఛన్ల భారం దించుకోవడానికి ప్రభుత్వం పరీక్ష పెడుతుంటే.. వైకల్యాన్ని నిరూపించుకోవడానికి దివ్యాంగులు అవస్థలు పడుతున్నారు.

వైకల్యానికి పరీక్షల శిక్ష

- వైకల్యాన్ని పునః పరిశీలన చేసుకోవాలని ఆదేశం
- పింఛన్లు ఏరివేసే కుట్రలో మళ్లీ తనిఖీలు
- కొత్తగా పరీక్షల పేరుతో పింఛనుదారులను ఇబ్బంది పెడుతున్న ప్రభుత్వం
- జిల్లాలో 31,800 మందికి తప్పని తిప్పలు
- ఆస్పత్రుల వద్ద నరకయాతన పడుతున్న దివ్యాంగులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

కోరి తెచ్చుకున్న కొరివిలా కూటమి ప్రభుత్వం తయారైంది. ఎన్నో ఏళ్లుగా దివ్యాంగ పింఛన్లు అందుకుంటున్న వారికి మళ్లీ పరీక్షలంటూ ఇబ్బంది పెడుతోంది. పింఛన్ల భారాన్ని తగ్గించుకోవడానికి కుట్రపూరితంగా వ్యవహరిస్తోంది. 'ఎన్నో ఏళ్లుగా పింఛన్ తీసుకుంటున్నాం. ఏ ప్రభుత్వం లోనూ ఇలా జరగలేదు. ఎప్పుడూ చూడలేదు. ఇదేం ఖర్మో మరి. మమ్మల్ని ఈ రకంగా ఇబ్బందులు పెడుతోంది' అని శాపనార్థాలు పెడుతున్నారు. ప్రభుత్వం పెడుతున్న క్షోభకు పింఛనుదారులే కాదు వారి సహాయకులుగా ఆస్పత్రులకు వస్తున్న కుటుంబ సభ్యులు కూడా యాతనపడుతున్నారు. ఎవరో దొడ్డిదారిన పింఛన్లు పొందితే వారిని తొలగించకుండా ఇలా అందరినీ ఇబ్బంది పెట్టడం సరికాదని అంటున్నారు. కొందరు తమ చంటి బిడ్డలను చంకనేసుకుని సహాయకులతో వచ్చి నరకయాతన అనుభవిస్తున్నారు. కాళ్లు, చేతులు సరిగా లేని వారు, అంధులు, బధిరులు ఆస్పత్రుల వద్ద గంటల కొద్దీ నిరీక్షించలేక ఆపసోపాలు పడుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా 31,800 మందికి ఈ తిప్పలు తప్పడం లేదు. మొత్తం 12 బృందాలు పునః పరిశీలన తనిఖీలు చేస్తున్నాయి. విజయనగరం, మన్యం జిల్లాకు చెందిన వైద్య బృందాలు జిల్లాలో పరీక్షలు చేస్తున్నాయి. ఈఎన్‌టీ, మానసిక వికలాంగులు, ఆప్తమాలజీకైతే రిమ్స్ ఆస్పత్రిలో, ఆర్థోపెడిక్ అయితే మండల కేంద్రాల్లోని ఆస్పత్రుల్లో పునఃపరిశీలన చేస్తున్నారు. మొదట పరీక్షలో అర్హులైతే ఓకే. ఏ మాత్రం తేడా అనిపించినా మరో టీమ్‌ల చేత పరీక్షలు చేయిస్తారు. అక్కడ అర్హులైతే మళ్లీ మూడో టీమ్ చేత పరీక్షలు చేయిస్తారు. అక్కడ తేడా కొడితే ఇంటికే. ఇదంతా ఒక ఎత్తు అయితే దూరాభారం నుంచి వచ్చిన దివ్యాంగులకు ఆస్పత్రుల్లో కనీసం పట్టించుకోవడం లేదు. కనీసం టీ కూడా ఇవ్వలేదు. కొన్నిచోట్ల నీరు కూడా దొరకని పరిస్థితి. కుర్చీలు కూడా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయలేదు.



పదేళ్లుగా తీసుకుంటున్నా..

ఇద్దరు పిల్లలతో తల్లిని చూడండి. ఆమదాలవలస మండలం కొర్లకోట వీరిది. వీరిలో కొడుకు రాజశేఖర్‌కు 20 ఏళ్లుగా పింఛను వస్తుంది. స్వాతమ్మ అనే కుమార్తెకు 16 ఏళ్లుగా పింఛను వస్తోంది. ఈ ఇద్దరు పిల్లలకు వినబడదు, మాట్లాడలేరు. అయినా వెరిఫికేషన్ చేసుకోవాలని చెప్పడంతో రిమ్స్‌కు వచ్చారు. ఆ ఇద్దర్ని పిల్లల్ని వెంట పెట్టుకుని ఆస్పత్రుల్లో తిప్పలు పడాల్సి వచ్చింది.



రూ. 30 నుంచి పింఛను తీసుకుంటున్నా..

వీల్‌చైర్‌లో కూర్చొన్న వ్యక్తి పేరు తమ్మినేని వైంకుఠం. వీరిది ఆమదాలవలస మండలం కొర్లకోట. ఈయన రూ.30ల నుంచి పింఛను తీసుకుంటున్నారు. పూర్తిగా వినికిడి లోపం ఉంది. ఇప్పుడాయన్ని పునః పరిశీలన చేసుకోమని చెప్పడంతో ఇలా ఆస్పత్రిలో తిప్పలు పడ్డారు.

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

మానసిక వేదన



ఈ ముగ్గురూ మానసిక దివ్యాంగులు. వీరిది ఆమదాలవలస మండలం వెంకయ్యపేట గ్రామం. వీరిలో ఒకరు పల్లవి(9), ఇంకొకరు పేరు ప్రభావతి(34), మరొకరు వెంకటేష్(38). వీరిలో పల్లవికి తప్ప మిగతా ఇద్దరికీ రూ.200 పింఛను దగ్గరి నుంచి వస్తోంది. పల్లవికి గత కొన్నేళ్లుగా పింఛను వస్తోంది. వీరి ముగ్గురికీ పత్రాలు తెచ్చుకోవాలని అధికారులు చెప్పడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు వచ్చారు. దీంతో వారంతా తమ కుటుంబ సభ్యులతో వచ్చి ఆస్పత్రుల్లో అవస్థలు పడ్డారు.

మళ్లీ తనిఖీలు ఎందుకో



చిత్రంలో కనిపిస్తున్న వృద్ధుడి పేరు డొక్కా ఆదినారాయణ. హిరమండలం చవితి సీధి వీరిది. ఈయనకు పూర్తిగా కళ్లు కనిపించవు. రూ.30ల పింఛన్ దగ్గర నుంచి ఆయన తీసుకుంటున్నారు. ఇప్పుడు మళ్లీ పునఃపరిశీలన అంటూ ఆ మండల అధికారులు శ్రీకాకుళం రిమ్స్‌కు పంపించారు. ఇక్కడ పడ్డ అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ఆయనకు తోడుగా భార్య వచ్చారు.

● ఆనంద శంబరం

దారులన్నీ జన సంద్రమే.. ఎటువైపు చూసినా కనుచూపు మేర 'శంబర'మే. దిక్కులు పిక్కటిల్లేలా అమ్మ శరణు ఘోష ఓ వైపు.. సాక్షీభూతంగా నిలిచిన గోముఖీ నది సవ్వడులు మరోవైపు లయబద్ధంగా సాగుతుంటే.. చల్లని తల్లి, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి.. ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం.. గిరిజనుల కొంగు బంగారం పోలమాంబ 36 అడుగుల సిరిమానుపై ఠీవిగా ఆశీనురాలై, పురవీధుల్లో ఊరేగింది. తన చల్లని చూపుతో భక్తులకు ఆశీర్వచనాలు అందజేసింది. ఈ అపురూప ఘట్టాన్ని కనులారా తిలకించిన భక్తకోటి మురిసిపోయింది. ఆనందంతో పులకించిపోయింది.

సాక్షి, పార్వతీపురం మన్యం/మక్కువ/సాలూరు:

గిరిజనుల ఆరాధ్య దేవత శంబర పోలమాంబ సిరిమానోత్సవం మంగళవా రం కనులపండువగా సాగింది. పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలం శంబరలో కొలువైన పోలమాంబ జాతరకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. సోమ, మంగళవారాల్లో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. పసుపు కుంకుమలు, చీర లు సమర్పించారు. మొక్కుబడులు చెల్లించారు. పలువురు భక్తులు తలనీలాలు సమర్పించారు. ఈ సంబరంలో కీలక ఘట్టమైన సిరిమానోత్సవం మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభమైంది. పూజారి జన్నిపేకాపు రామారావు సిరిమానును అధిరోహించారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి పట్టు వస్త్రాలు సమర్పించారు.

తొలుత ఇలా కట్టారు



సగం కూల్చారు



పూర్తిగా నేలమట్టం చేశారు



కడుతున్నారో.. ఎందుకు కూల్చేస్తున్నారో..?

4వ సారి





మళ్లీ నిర్మాణం మొదలుపెట్టారు

- కట్టడం.. కూల్చడం.. కట్టడం
- మిల్లు జంక్షన్‌లో జరుగుతున్న పనుల్లో అయోమయం
- రూ. 40లక్షలతో చేపడుతున్న బ్యూటిఫికేషన్ పనుల్లో గందరగోళం
- ప్రజాప్రతినిధులు, అధికారుల తీరుపై అంతటా విస్మయం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

రథసప్తమి వేడుకల పేరుతో నగరంలో జరుగుతున్న బ్యూటిఫికేషన్ పనుల్లో గందరగోళం చోటు చేసుకుంటోంది. ఎందుకు కడుతున్నారో.. ఎందుకు కూల్చేస్తున్నారో ఎవరికీ తెలియడం లేదు. స్థానిక మిల్లు జంక్షన్ వద్ద జరుగుతున్న కట్టడాలు, కూల్చివేతలు చూసి ప్రజలే తిడుతున్నారు. పాలకొండ రోడ్డులో జరుగుతున్న సెంట్రల్ డివైడర్ పనులు, మిల్లు జంక్షన్ వద్ద జరుగుతున్న ఫౌంటెయిన్ పనులు ప్రతి ఒక్కరినీ అయోమయానికి గురి చేస్తున్నాయి. మిల్లు జంక్షన్ వద్ద జరుగుతున్న ఫౌంటెయిన్ పనులను తీసుకుంటే.. బాబూ జగ్జీవన్ రావు విగ్రహం వద్ద బ్యూటిఫికేషన్‌లో భాగంగా ఫౌంటెయిన్ నిర్మించాలని నిర్ణయం తీసుకున్నారు. తొలుత 12 అడుగులతో నిర్మించాలని పనులు చేపట్టారు. ఫౌంటెయిన్ నిర్మాణం పూర్తయ్యాక కాదు కాదు.. 10 అడుగులకే అని నిర్మించిన దాంట్లో కొంత భాగాన్ని కూల్చేశారు. కూల్చేయగా మిగిలిన ఫౌంటెయిన్ నిర్మాణం పనిని తర్వాత పూర్తి చేశారు. మళ్లీ ఏమైందో పూర్తిగా నిర్మించిన ఫౌంటెయిన్ మళ్లీ నేలమట్టం చేశారు. అప్పటికే నిర్మించిన ఐరన్, సిమెంట్ మెటీరియల్ తదితర అవశేషాలు కనబడకుండా రాత్రికి రాత్రి పూర్తిగా కూల్చేశారు. దీంతో అటుగా వచ్చిన ప్రజలే కాదు కలెక్టరేట్‌కు వెళ్లే అధికారులు కూడా ముక్కున వేలేసుకున్నారు. ఇప్పుడు మళ్లీ నాయకులకు, అధికారులకు ఏం తట్టిందో తెలియదు గాని కూల్చిన చోటే మళ్లీ మరో కట్టడాన్ని నిర్మిస్తున్నారు. మొత్తానికి శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా)కు చెందిన రూ.40లక్షలతో చేపడుతున్న పనులన్నీ దుర్వినియోగమవుతున్నాయి. ఇదంతా చూసి ఈ ప్రభుత్వానికి ఏమైందో, ఎవరి కోసం ఈ పనులు చేస్తున్నారో, కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చడం తప్ప నగరానికి ఒరిగిందేంటని ప్రశ్నిస్తున్నారు.

రూ. 100 చెప్పారు రూ.లక్ష లాగేశారు

తెలుగు తమ్ముళ్ల చేతివాటం



- మెళియాపుట్టి మండలం వసుంధరలో టీడీపీ సభ్యత్వం పేరిట ఒక మహిళను బురిడీ కొట్టించిన నాయకులు
- స్కానర్ ద్వారా ఆమె అకౌంట్ నుంచి రూ. లక్ష జమ చేసుకున్న వైనం
- 80 రోజులు వెనక్కి తిరిగివ్వని వైనం
- విషయం బయటకు పొక్కడంతో డబ్బు తిరిగి ఇచ్చేసిన ఎమ్మెల్యే మనుషులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: కోటి సభ్యత్వాల ముసుగులో టీడీపీ నాయకులు కొందరు మోసాలకు పాల్పడ్డారు. సభ్యత్వ నమోదు చేసుకుంటేనే పథకాలు వస్తాయని బెదిరించారు. గ్రామాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు టార్గెట్లు ఇచ్చి వారి చేత సభ్యత్వ నమోదు చేయించారు. ఉపాధి కూలీలు, అన్న క్యాంటీన్‌కు వచ్చే వారికి కూడా సభ్యత్వాలు ఇప్పించారు. ఈ సందడిలో ఒక నేత రూ.100 సభ్యత్వమని చెప్పి స్కానర్ ద్వారా రూ.లక్ష లాగేశారు. మెళియాపుట్టి మండలం వసుంధర గ్రామంలో ఈ ఘటన జరిగింది. ఒక మహిళ బ్యాంకు ఖాతా నుంచి రూ.లక్ష లాగేసి, ఆమె తెలుసుకున్నాక తప్పు జరిగిందని, చెల్లించిన మొత్తాన్ని అప్పుగా ఇచ్చినట్టు ప్రామిసరీ నోట్ రాసిచ్చారు. కానీ మూడు నెలలు అవుతున్నా ఆ రూ.లక్ష తిరిగి ఇవ్వకపోవడంతో బాధిత మహిళ బయటికొచ్చి గగ్గోలు పెట్టారు. మీడియాను ఆశ్రయించడంతో పార్టీ పరువు పోయిందని హుటాహుటిన ఆ రూ.లక్ష వెనక్కి ఇచ్చి ప్రాయశ్చిత్తం చేసుకున్నారు.

ఒత్తిడి చేసి



ఈమె పేరు లక్ష్మీ నాయక్. పాతపట్నం నియోజకవర్గం మెళియాపుట్టి మండలం వసుంధర గ్రామంలోని బీసీ కాలనీలో ఉంటారు. పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, మాజీ ఎంపీపీ సలాన మోహనరావు అనుచరులైన ఆ గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు తులసీ తేజేశ్వరరావు, సలాన వెంకటరావు ఆమెను టీడీపీ సభ్యత్వం తీసుకోవాలని ఒత్తిడి చేశారు. స్థానికంగా ఉన్న పరిస్థితుల్లో ఆమె సభ్యత్వం తీసుకోవడానికి అంగీకరించారు.

ఘరానా మోసం




ఈ స్క్రీన్ షాట్ చూడండి. తెలుగు దేశం పార్టీ అకౌంట్‌కు రూ. లక్ష జమ అయినట్టు చూపిస్తోంది. స్థానిక టీడీపీ నాయకులు ఒత్తిడి మేరకు ఆమె తమ సభ్యత్వం కింద రూ.100 ఇవ్వగా, తమకు క్యాష్ వద్దని స్కానర్ ద్వారా చెల్లించాలని ఆ పార్టీ నాయకులు కోరారు. దీంతో వాళ్లే స్కానర్ ఓపెన్ చేసి, రూ.100 బదులు రూ.లక్ష ఫీడ్ చేసి, పాస్‌వర్డ్ నొక్కమని లక్ష్మీనాయక్‌కు ఇచ్చారు. మోసం గుర్తించకుండా ఆమె పాస్‌వర్డ్ కొట్టేశారు. రూ.100 చెల్లించానని ఆమె అనుకున్నారు. కానీ, కాసేపటికి ఆమె అకౌంట్ నుంచి రూ.లక్ష విత్‌డ్రా అయినట్టు మెసేజ్ వచ్చింది. జరిగిన విషయాన్ని వెంటనే తన భర్త సురేష్ నాయక్‌కు తెలియజేసింది. వెంటనే అప్రమత్తమై స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టేట్‌మెంట్ తీశారు. అందులో తెలుగుదేశం పార్టీ అకౌంట్‌కు రూ.లక్ష జమ అయినట్టు రికార్డయ్యి ఉంది. దీంతో ఆమె లబోదిబోమంటూ తన వద్దకు వచ్చిన టీడీపీ నాయకుల్ని కలిసి నిలదీశారు.

గుట్టు రట్టు కాకుండా



బాధిత మహిళకు టీడీపీ నాయకులు రాసిచ్చిన ప్రామిసరీ నోటు ఇది. జరిగిన మోసం బయటకు తెలిస్తే రచ్చ రచ్చ అయిపోతుందని ఆ రూ.లక్ష తమకు అప్పుగా ఇచ్చినట్టు, రూపాయి వడ్డీకి తీసుకున్నట్టు, ఆ సొమ్ము వెనక్కి చెల్లించేస్తామని ప్రామిసరీ రాసిచ్చారు. గత ఏడాది నవంబర్ 5వ తేదీన ఈ తతంగం జరిగింది. జనవరి 26వ తేదీ వరకు ఇవ్వలేదు.

రచ్చకెక్కాక..



బాధిత మహిళ ఖాతాకు ఫోన్ పే ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన స్క్రీన్ షాట్ ఇది. ఎంతకీ డబ్బులు ఇవ్వడం లేదని బాధిత మహిళ రోడ్డెక్కి మీడియాను ఆశ్రయించడంతో టీడీపీ నాయకుల్లో కదలిక వచ్చింది. ఎక్కడికక్కడ చర్చకు, సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున హల్‌చల్ చేయడంతో టీడీపీ నాయకులు దిగొచ్చారు. హుటాహుటీన ఆమె బ్యాంకు ఖాతాకు ఆ రూ.లక్ష ఫోన్ పే ద్వారా ట్రాన్స్‌ఫర్ చేశారు.



టీడీపీ అకౌంట్‌కు రూ. లక్ష జమ అయినట్టుగా చూపిస్తున్న ఎస్‌బీఐ స్టేట్‌మెంట్



ప్రాయశ్చిత్తం

ప్రాయశ్చిత్తం చేసుకున్నట్టు బాధిత మహిళ కుటుంబ సభ్యులతో పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తీసుకున్న ఫోటో ఇది. తప్పు జరిగిపోయిందని, ఆ తప్పును సరిదిద్దామని, ఆమెకు ఇవ్వాల్సిన రూ. లక్ష చెల్లించేశామని చెప్పేందుకు వారితో కలిసి ఎమ్మెల్యే గోవిందరావు, ఆయన అనుచరులు తీసుకున్న ఫోటోను మీడియాకు విడుదల చేయడం కొసమెరుపు.

క్లుప్తంగా

యువకుడు ఆత్మహత్య


నారాయణరావు

ఎచ్చెర్ల: లావేరు మండలం నాగంపాలెం గ్రామానికి చెందిన రౌతు నారాయణ రావు (25) ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ నెల 26న మద్యం సేవించి ఇంటికి రావడంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో క్షణికావేశంలో గడ్డి మందును తాగడంతో నారాయణరావును ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. లావేరు పోలీ

అట్టహాసంగా స్పోర్ట్స్ మీట్



విశాఖ స్పోర్ట్స్: కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో 27వ ఇంటర్ పాలిటెక్నిక్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ ఘనంగా ప్రారంభమైంది. రాష్ట్రంలోని 13 జిల్లాలకు చెందిన 720 మంది బాలురు, 510 మంది బాలికలు అథ్లెటిక్స్‌తో పాటు ఆరు క్రీడాంశాల్లో పోటీపడనున్నారు. వాలీబాల్, కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, బ్యాడ్మింటన్, టీటీ, చదరంగంతో పాటు అథ్లెటిక్స్ ట్రాక్, ఫీల్డ్ అంశాల్లోనూ మూడు రోజుల పాటు జరిగే ఈపోటీలో 138 ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్స్‌కు చెందిన విద్యార్థులు ప్రాంతీయ జట్లుగా తలపడనున్నారు. పురుషుల లాంగ్ జంప్‌లో శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ నుంచి కె.శివరామకృష్ణ ప్రథమ స్థానం, గిడిజాల సాయిగణపతి పాలిటెక్నిక్ కాలేజీ నుంచి ఎస్.ఈశ్వరవర్ధన్ ద్వితీయ స్థానం, పాడేరు ప్రభుత్వ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ నుంచి కె.ప్రశాంత్ కుమార్ తృతీయ స్థానంలో నిలిచినట్లు కోఆర్డినేటర్ డాక్టర్ కె.నారాయణరావు తెలిపారు.

దివ్యాంగులకు ఉచితంగా ఉపకరణాలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా వారి సి.ఎస్.ఆర్. ఫండ్స్ సహకారంతో దివ్యాంగులకు ఉచితంగా ఉపకరణాలు పంపిణీ చేస్తామని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళం డివిజన్ పరిధిలోని దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ అర్హత గుర్తింపు కార్యక్రమం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించారు. కేంద్రమంత్రితో పాటు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన నాణ్యమైన పరికరాలను అర్హులను గుర్తించి అందజేస్తామన్నారు. త్వరలో పలాస, టెక్కలి డివిజన్లలోనూ ఎంపిక నిర్వహిస్తామని చెప్పారు. కలెక్టర్ దివ్యాంగులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, వృద్ధులు, హిజ్రాల సంక్షేమ శాఖ ఏడీ కవిత, జెడ్పీ సీఈఓ తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి బీమాను సద్వినియోగం చేసుకోండి


రైతులతో మాట్లాడుతున్న ఏడీహెచ్ శైలజ

కవిటి: జిల్లాలో 35000 ఎకరాల్లో కొబ్బరి సాగు చేస్తున్న రైతులంతా ఈ ఏడాది ఉద్యానశాఖ ద్వారా ప్రభుత్వం కల్పిస్తున్న కొబ్బరి బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ (ఏడీహెచ్) ఎస్.శైలజ అన్నారు. మంగళవారం చండిపురం రైతు సేవా కేంద్రంలో వీఏఏ, వీఏహెచ్‌లతో సమావేశం అనంతరం ఆర్.భైరిపురంలో రైతులతో భేటీ అయ్యారు. మార్చి 31లోగా సచివాలయం వీఏఏ, వీఏహెచ్‌లను సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆర్అండ్ఆర్ పథకం రెండో విడత నిధులు జిల్లాకు చేరాయని, త్వరలో ఆర్.భైరిపురం రైతులకు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ ద్వారా డ్రిప్, స్ప్రింక్లర్ ఇరిగేషన్ పథకాన్ని కోరుకునే రైతులు సచివాలయాల్లో సంప్రదించాలన్నారు. కోకోనట్ ఏరియా ఎక్స్‌పేన్షన్ కార్యక్రమం ద్వారా ఖాళీ వ్యవసాయ క్షేత్రాలలో కొత్తగా మొక్కలు వేసి కొబ్బరి పంటను అభివృద్ధి చేసే కార్యక్రమం అందుబాటులో ఉందన్నారు. కార్యక్రమంలో మండల ఉద్యానశాఖ అధికారి పోలాకి మాధవీలత, ఎంపీఈఓ పూడి లలిత, సిబ్బంది బాలరాజు, గణపతి, ఏపీమైక్రో ఇరిగేషన్ ఎంఐఏఓ బొర్ర శరణ్య తదితరులు పాల్గొన్నారు.

మా ఉసురు ఊరికే పోదు!

పెదపాడులో మహిళల ఆవేదన

- ఎమ్మెల్యే మాట నిలబెట్టుకోలేదని మండిపాటు
- ఉద్రిక్తంగా మారిన ఇళ్ల తొలగింపు
- కోర్టు స్టే ఉందని గడువు కోరిన స్థానికులు
- అయినా పట్టించుకోని అధికారులు, పోలీసులు


ఇంటిని నేలమట్టం చేసిన దృశ్యం

సాక్షి టాస్క్‌ఫోర్స్ : జిల్లా కేంద్రాన్ని ఆనుకుని ఉన్న పెదపాడులో మంగళవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసు బందోబస్తు నడుమ రెవెన్యూ, మున్సిపల్ అధికారులు జేసీబీతో పలు ఇళ్లను కూల్చివేశారు. మరికొన్ని చోట్ల ప్రహరీలు నేలమట్టం చేశారు. దీంతో బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ఉసురు తప్పక తగులుతుందని పాలకులకు శాపనార్థాలు పెట్టారు. సుమారు రెండు గంటల పాటు బాధితులు, అధికారుల మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం జరిగింది. ఒక్కసారిగా ట్రాఫిక్ స్తంభించి రాకపోకలకు అంతరాయం కలగడంతో వాహనాలను పాత్రునివలస మీదుగా దారి మళ్లించారు. పోలీసులు మూకుమ్మడిగా వచ్చి ఇళ్లకు అడ్డంగా ఉన్నవారిని లాక్కెళ్లి జీపులో ఎక్కించేశారు. ఎవరైనా ఎక్కువ చేస్తే కేసులు పెడతామంటూ భయభ్రాంతులకు గురిచేశారు.

ఇదీ పరిస్థితి..

ప్రస్తుతం పెదపాడు రోడ్డు 30– 40 అడుగుల విస్తీర్ణంలో ఉంది. ఆ రోడ్డును 60 అడుగుల వరకు విస్తరించాలని అధికారులు నిర్ణయించారు. ముందుగా కాలువలు మాత్రమే విస్తీర్ణం చేస్తామని చెప్పి ఇప్పుడు ఇళ్లను ఎలా పడగొడతారని స్థానికులు అధికారులను నిలదీస్తున్నారు.

చెప్పిందొకటి.. చేసిందొకటి..

ముందుగా పెదపాడులో కాలువలను మాత్రమే విస్తరిస్తామని ఏ ఒక్క ఇంటికి హాని జరగదని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ఇటీవల స్థానికులకు హామీ ఇచ్చారు. అయితే అధికారులు మాత్రం కాలువల పరిధిని దాటి ఇంటి నిర్మాణాల వరకూ వచ్చేశారు. ముందుగా జేసీబీలు, ప్రొక్లెయిన్లతో అడ్డంగా ఉన్నవాటిని ఒక్కొక్కటి కూల్చేశారు. ఇంటిగేట్లు, ప్రహరీలు నేలమట్టం చేసేశారు. మరో రెండు ఇళ్లు కూల్చేశారు. మరో 40 ఇళ్లకూ నష్టం వాటిల్లింది.

ఒక్క రోజు గడువు ఇవ్వాలని కోరినా..

జేసీబీలతో రాగానే కలగ అప్పన్న ఇంటి వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. కోర్టు స్టే తెచ్చుకున్నామని, ఒకరోజు అవకాశం ఇస్తే పూర్తి కాగితాలు అందిస్తామని అప్పన్న పోలీసులతో చెప్పారు. ఉన్నఫలంగా ఖాళీ చేయమంటే ఎలాగని, కనీసం ముందస్తు నోటీసులు ఇవ్వకుండా కూల్చుతామంటే ఊరుకునేది లేదన్నారు. ఈలోగా గ్రామస్తులు జేసీబీకి అడ్డంగా నిలబడి పనులను అడ్డుకున్నారు. దీంతో పోలీసులు చేతులెత్తేశారు. ఈలోగా టౌన్ సీఐ పైడపునాయుడు, మరో ముగ్గురు సీఐలు, అదనపు బలగాలు వచ్చి అడ్డంగా ఉన్నవారిని సైతం బలవంతంగా లాక్కెళ్లి జీపులో ఎక్కించి స్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేస్తామంటూ బెదిరించారు.


అప్పన్నను బలవంతంగా జీపు ఎక్కిస్తున్న పోలీసులు


గ్రామస్తులు, పోలీసులకు మధ్య తోపులాట

న్యాయం చేయాలి..



గ్రామస్తులంతా కలిసి ఎమ్మెల్యే గొండు శంకర్‌ను వారం కిందట కలిశాం. మా ఇల్లుకు ఎటువంటి హాని జరగదన్నారు. కాలువలు అడుగు, రెండు అడుగులు మాత్రమే తీస్తామన్నారు. అధికారులు మాత్రం ఉన్నఫలంగా కష్టార్జితంతో ఇళ్లను బలవంతంగా కొట్టేస్తున్నారు. మేమంతా ఏం చేయాలి. ఎక్కడికి పోవాలి. మాకు న్యాయం చేయాలి.

– కలగ అప్పన్న, పెదపాడు

రోడ్డున పడ్డాం



కనీసం ముందస్తు సమాచారం లేకుండా ఇల్లు కొట్టేశారు. మాకు ఎటువంటి ఆస్తులు లేవు. మేమంతా ఎక్కడికి పోవాలి. అభివృద్ధి చేస్తామంటే ఇదేనా? ఇల్లు కూల్చివేయడంతో రోడ్డున పడ్డాం.

– బలగ భాస్కరరావు, పెదపాడు

ఇంటి అప్పు తీరలేదు



నేను నా భర్త కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాం. ఇంటిపై రూ.5లక్షలు అప్పు తీసుకున్నాం. ఇంకా అప్పు కడుతున్నాం. నాకు అనారోగ్య సమస్యలు ఉన్నాయి. ఇంటి ముఖద్వారంతో పాటు నేలమట్టం చేశారు. మేం ఎక్కడికి పోవాలి. మాకు న్యాయం జరగాలి.

– కలగ దుర్గమ్మ, పెదపాడు

పకడ్బందీగా రథసప్తమి ఏర్పాట్లు

- అధికారులకు మంత్రి అచ్చెన్న ఆదేశం


పనులు పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం/అరసవల్లి: జిల్లాలో మూడు రోజుల పాటు రాష్ట్ర పండగా రథసప్తమికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. రథసప్తమి సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌లతో కలిసి మంగళవారం అధికారులతో సమీక్షించారు. క్యూలైన్లు, ఇతర ఏర్పాట్లను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఏర్పాట్లపై సూచనలు చేశారు. నగర అభివృద్ధి, సుందరీకరణ పనులపై నగర కమిషనర్ ప్రసాదరావును అడిగి తెలుసుకున్నారు. సింహద్వారం నుంచి డే అండ్ నైట్ జంక్షన్, ఏడు రోడ్ల జంక్షన్, పాత బస్టాండ్ నుంచి మిల్లు జంక్షన్ వరకు జరుగుతున్న పనులను పరిశీలించారు. రాత్రీ పగలు పనిచేసి రథసప్తమి నాటికి పనులు పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు వస్తారని, అందుకు సరిపడా ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమాల్లో మున్సిపల్ మున్సిపల్ ఇంజనీర్ దక్షిణామూర్తి తదితరులు పాల్గొన్నారు.

వారికి ఆలయ స్థలాలు కేటాయింపు

అనంతరం ఆలయానికి ఎదురుగా ఉన్న స్థలాల యజమానులతో మంత్రి మాట్లాడారు. కోరుకున్న చోట స్థలాన్ని కేటాయిస్తామని మరోసారి మంత్రి హామీ ఇచ్చారు. త్వరలో కేంద్ర ప్రభుత్వ 'ప్రసాద్' స్కీం అరసవల్లి క్షేత్రానికి అమలయ్యేలా కేంద్రమంత్రి రామ్మోహన్నాయుడు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఫెస్టివల్ ఆఫీసర్ కె.సుబ్బారావు, ఆర్డీవో సాయిప్రత్యూష, డీఎస్పీ వివేకానంద, ఈఓ భద్రాజీ, కార్పొరేషన్ కమిషనర్ ప్రసాదరావు, పబ్లిక్‌హెల్త్ ఎస్ఈ పి.సుగుణాకరరావు, విద్యుత్ శాఖ ఈఈ యోగేశ్వరరావు, టీడీపీ ఇన్‌చార్జిలు ఉంగటి రమణమూర్తి, తెలుగు నాగరత్నం, ఉంగటి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

దర్శన టికెట్లపై సమీక్ష..

ఆలయంలో వచ్చే నెల 4న జరగనున్న రథసప్తమి ఉత్సవానికి వివిధ దర్శన టికెట్లు, దాతల పాసులపై మంత్రి సమీక్షించారు. ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులకు వీఐపీ పాసులను ఇచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. దాత పేరిట ఒక పాసు మాత్రమే ఇస్తే మంచిదని మంత్రి అభిప్రాయం వ్యక్తం చేయగా..ఆలయ అభివృద్ధికి అసలు కారణం దాతలే అని...పలు దఫాలుగా రూ.లక్షకు మించి విరాళాలు ఇచ్చిన దాతలకు ఒకే పాసు ఇచ్చే నిర్ణయంపై పునరాలోచించాలని కోరారు. కార్యక్రమంలో చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ కె.సుబ్బారావు, అసిస్టెంట్ చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్లు కె.శోభారాణి, కెఎన్‌డివి ప్రసాద్, దేవదాయ శాఖ ఈఈ రమణ, ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ తదితరులున్నారు.

వేడుకలకు పటిష్ట భద్రత

శ్రీకాకుళం క్రైమ్ : ఫిబ్రవరి 2, 3, 4 తేదీల్లో జరగనున్న అరసవల్లి సూర్యనారాయణ స్వామి రథసప్తమి వేడుకలు సందర్భంగా పటిష్ట భద్రతతో కూడిన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద సంఖ్యలో భక్తులు వస్తున్నందున ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, శాంతియుతంగా భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మూడురోజులు నిర్విరామంగా జరిగే ఉత్సవాలు నిరంతరం సీసీ టీవీ, డ్రోన్ కెమెరాల పర్యవేక్షణలో ఉండాలన్నారు. ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపల్ అధికారులను సంప్రదించి వాహనాల పార్కింగ్, లైటింగ్ వంటివి ఏర్పాటు చేయాలని సూచించారు. దేవదాయ, రెవెన్యూ అధికారుల సమన్వయంతో దర్శనాలు సజావుగా చేయించాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీలు కె.వి.రమణ, పి.శ్రీనివాసరావు, డీఎస్పీలు వివేకానంద, అప్పారావు, ప్రసాదరావు, శేషాద్రి, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

2,3 తేదీల్లో రథసప్తమి క్రీడాపోటీలు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి, ఎమ్మెల్యే, కలెక్టర్ తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: అరసవల్లి సూర్యనారాయణస్వామి రథసప్తమి ఉత్సవాలను పురస్కరించుకుని ఫిబ్రవరి 2, 3 తేదీల్లో నిర్వహిస్తున్న క్రీడాపోటీలను విజయవంతం చేయాలని కేంద్రమంత్రి కె.రామ్మోహన్‌నాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలో రాష్ట్రస్థాయిలో వాలీబాల్ పోటీలు, జిల్లాస్థాయిలో వెయిట్‌లిఫ్టింగ్, గ్రామీణ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. వాలీబాల్ పోటీల విజేతలకు రూ.లక్ష నగదు బహుమతులు, వెయిట్‌లిఫ్టింగ్ విజేతలకు రూ.20వేలు, గ్రామీణ క్రీడల్లో రూ.60వేలు నగదు బహుమతులు అందజేయనున్నట్టు వివరించారు. కార్యక్రమంలో డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు, ఒలింపిక్ అసోసియేషన్ ముఖ్య సలహాదారు పి.సుందరరావు, అధికారులు పాల్గొన్నారు.

చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్‌గా సుబ్బారావు



అరసవల్లి: రథసప్తమి రాష్ట్ర పండుగకు చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ (సీఎఫ్ఓ)గా దేవదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ కె.సుబ్బారావును నియమిస్తూ దేవదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ రామచంద్ర మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే తొలిసారిగా సీఎఫ్ఓకు సహాయకులుగా ఇద్దరు డిప్యూటీ కమిషనర్లు కె.శోభారాణి, కేఎన్‌డీవీ ప్రసాద్‌లను కూడా నియమించారు. వచ్చే నెల 4వ తేదీతో ఉత్సవం ముగించేవరకు తదుపరి ఆదేశాల వరకు వీరు విధుల్లో ఉండనున్నారు.

ఉపకార వేతనాలకు 108 మంది ఎంపిక


ఎంపికైన విద్యార్థినులతో ప్రిన్సిపాల్, కళాశాల అధ్యాపకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు చరిత్ర సృష్టించారు. సంతూర్ స్కాలర్‌షిప్‌కు రికార్డుస్థాయిలో 108 మంది ఎంపికయ్యారు. ఒకటో తరగతి నుంచి గ్రామీణ ప్రాంతాల్లో మాత్రమే విద్యాభ్యాసం చేసిన ప్రతిభ కలిగిన విద్యార్థులకు విప్రో కెరీర్, విప్రో ఫౌండేషన్ ఈ స్కాలర్‌షిప్ అందిస్తోంది. కళాశాల నుంచి పంపించిన ప్రతిపాదన మేరకు 2024–25 విద్యా సంవత్సరానికి ఎంపికైన 108 మంది విద్యార్థినుల జాబితాను మంగళవారం విడుదల చేశారు. వీరికి నెలకు రూ.2వేలు చొప్పున మూడేళ్లపాటు రూ. 72 వేలు అందజేయనున్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు, కార్యక్రమంలో శంకర్‌నారాయణ, కృష్ణారావు, పద్మావతి, ఆదిలక్ష్మి, సంతోష్, కళ్యాణి తదితరులు అభినందించారు.

ఉత్తరాంధ్రలోనే గంజాయి మూలాలు

- చిన్నారులు, వృద్ధులపై లైంగికదాడులు సిగ్గుచేటు
- విలేకరులతో డీజీపీ ద్వారకా తిరుమలరావు


మాట్లాడుతున్న డీజీపీ ద్వారకా తిరుమలరావు

శ్రీకాకుళం క్రైమ్ : రాష్ట్రంలో ఎక్కడ గంజాయి పట్టుబడినా మూలాలన్నీ ఉత్తరాంధ్ర నుంచే ఉంటున్నాయని, ఈ నేపథ్యంలో ఈగల్ అనే సంస్థను ఏర్పాటు చేసి ఎలిట్ యాంటీ నార్కోటిక్ ఫోర్స్ ద్వారా గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్నామని డీజీపీ ద్వారకా తిరుమలరావు అన్నారు. గంజాయి సాగు, క్రయ విక్రయాలు, అక్రమ రవాణా అరికట్టేలా చెక్ పోస్టులు పెంచామని, యువకులు, విద్యార్థులను సంకల్పం ద్వారా మాదకద్రవ్యాలు వాడొద్దని అవగాహన పరుస్తున్నామని చెప్పారు. మంగళవారం డీజీపీ హోదాలో తొలిసారి జిల్లా పర్యటనకు వచ్చిన ద్వారకా తిరుమలరావుకు ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి సాదరంగా ఆహ్వానించారు. పోలీసులు గౌరవవందనం సమర్పించారు. డీఐజీ గోపినాథ్ జెట్టీ, ఎస్పీ మహేశ్వరరెడ్డి, ఇతర జిల్లా పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించి అనంతరం మీడియాతో మాట్లాడారు. బాలికలు, మహిళలనే కాకుండా 70 ఏళ్ల వృద్ధురాళ్లపైనా లైంగికదాడులు జరగడం సమాజం సిగ్గుపడాల్సిన విషయమని డీజీపీ చెప్పారు. సైబర్ నేరాలను అరికట్టేందుకు ప్రతీ జిల్లాకు డీఎస్పీని ఎస్‌హెచ్‌ఓగా టెక్నికల్ టీమ్‌ను పెట్టి సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికే వైజాగ్, విజయవాడలో ఇవి ఉన్నాయని చెప్పారు. మహిళలపై జరుగుతున్న నేరాలను అరికట్టేందుకు, తక్షణమే శిక్షలు పడేలా స్పెషల్ కోర్టులు హైకోర్టు ఏర్పాటు చేస్తుందన్నారు. రాష్ట్రంలో రెండు లక్షల సీసీ కెమెరాల ఏర్పాటే లక్ష్యంగా పెట్టుకున్నామని, ప్రభుత్వం అన్ని ఖర్చులు భరించడం కష్టం కాబట్టి దాతలు, ప్రజలు సహకరించాలని, మార్చి 31 నాటికి లక్ష పూర్తిచేస్తామన్నారు. జిల్లాలో పనిచేయని 460 కెమెరాలు బాగుచేశామని, ఇవికాక మరో 520 కొత్తవి ఉన్నాయని చెప్పారు.

రాష్ట్రంలో ఇటీవల జరుగుతున్న హత్యాకాండపై..

ఎన్నికల అనంతరం పార్టీలకతీతంగా జరుగుతున్న హత్యాకాండలపై డీజీపీ మాట్లాడుతూ హత్యలనేవి తగ్గాయని, ఓవరాల్‌గా క్రైమ్ రేట్ తగ్గిందని, జీరో క్రైమ్ దిశగా ముఖ్యమంత్రి పనిచేయమన్నారని డీజీపీ స్పష్టం చేశారు. రాజకీయ ఒత్తిళ్లతో చూడకుండా పారదర్శకంగానే పనిచేస్తున్నామని, తప్పు చేసినవారిపై కేసులు కడుతున్నామని చెప్పారు. పక్క రాష్ట్రంలో అలజడులు చేస్తూ ఏపీలో మావోయిస్టులు దాక్కుంటే చూస్తూ ఊరుకోమని, ఆపరేషన్లలో కీలక వ్యక్తులైన 30 మందిలో 13 మంది పార్టీలను వదిలేశాయని, మిగతా వారికోసం గాలిస్తున్నామని, తదనుగుణంగా ఇటీవల ఆపరేషన్లు పెంచామన్నారు. జిల్లాలో పేకాట డెన్‌లు, ఇసుక అక్రమ రవాణా పైడి భీమవరం చెక్‌పోస్టులో అడ్డుకోవడం లేదన్న ప్రశ్నపై దృష్టిసారిస్తామన్నారు. రాష్ట్ర విభజన చట్టం అనుసరించి పోలీసుల పదోన్నతులకు ఆటంకం కలుగుతుందన్న ప్రశ్నకు బదులిస్తూ డీఎస్పీలకు, సీఐలకు రెండు మూడు రోజుల్లో ప్రమోషన్ ఉంటుందన్నారు. జిల్లాలో రెండున్నరేళ్లుగా ఉన్న టెంపుల్ కేసులను ఛేదించిన పోలీసులకు అభినందించారు. ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం చక్కగా పనిచేస్తోందని కొనియాడారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు కె.వి.రమణ, పి.శ్రీనివాసరావు, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

స్థలాల లీజుతో ఆర్టీసీ ఆస్తుల పరిరక్షణ


డ్రైవర్ బీవీఆర్ మూర్తికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ద్వారకాతిరుమలరావు

శ్రీకాకుళం అర్బన్: సంస్థ పరిరక్షణ కోసమే ఆర్టీసీ స్థలాలు లీజుకు ఇస్తున్నట్లు ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు అన్నారు. మంగళవారం జిల్లాకు విచ్చేసిన ఆయన శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలోని ఒకటో డిపో గ్యారేజీ ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థలాలు లీజుకు ఇవ్వడం ద్వారా లీజుదారులే ఆస్తులను కాపాడతారని, తద్వారా ఆర్టీసీ సంస్థ స్థలాలు కాపాడగలుగుతున్నామని, అదే సమయంలో సంస్థకు రెవెన్యూ కూడా వస్తోందని చెప్పారు. ఉద్యోగులకు రావాల్సిన ఎస్ఆర్‌బీఎస్, ఎస్‌బీటీ ఉత్తర్వులను విడుదల చేశామన్నారు. రూ.120 కోట్లు బకాయిలు ఉండగా, ఇందులో రూ.60కోట్లు తక్షణమే విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. డ్రైవర్లు, కండక్టర్లకు ఈహెచ్ఎస్ ద్వారా వైద్య సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఒక్క యాక్సిడెంట్ కూడా చేయని శ్రీకాకుళం ఒకటో డిపో డ్రైవర్ బీవీఆర్ మూర్తి(33 ఏళ్ల 7 నెలల సర్వీసు), వై.జి.రావు(31 ఏళ్ల 7 నెలలు), రెండో డిపో డ్రైవర్ కె.రమణ(31 ఏళ్ల 6నెలలు)కు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రజారవాణా అధికారి ఎ.విజయ్ కుమార్, ఒకటి, రెండు డిపోల మేనేజర్లు హనుమంతు అమరసింహుడు, కె.ఆర్.ఎస్ శర్మ, అసిస్టెంట్ మేనేజర్లు వి.రమేష్, ఎ.గంగరాజు, ఎస్ఎం ఎంపీరావు, ఎల్ఎస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీలో పరీక్షల ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో పలు కోర్సుల పరీక్షలు ఫలితాలను ఎగ్జామినేషన్స్ డీన్ ఎస్.ఉదయ్‌భాస్కర్ మంగళవారం విడుదల చేశారు. ఫలితాలను జ్ఞానభూమి వెబ్‌సైట్, వర్సిటీ వెబ్‌సైట్‌లలో అందుబాటులో ఉంచారు. రీవాల్యుయేషన్‌కు 15 రోజుల్లోగా చేసుకోవచ్చని సూచించారు. మార్కులు జాబితాలు విద్యార్థులకు అందజేస్తామని చెప్పారు.

- ఎంహెచ్ఏ రెండో సెమిస్టర్‌లో 29 మంది పరీక్షలు రాయగా, అందరూ ఉత్తీర్ణత సాధించారు. నాలుగో సెమిస్టర్లో 16 మంది పరీక్ష రాయగా శతశాతం ఉత్తీర్ణత సాధించారు. ఎంఆర్‌హెచ్ఐలో 26 మందికి గాను 24 మంది పాసయ్యారు.
- ఐదేళ్ల ఎల్ఎల్‌బీలో రెండో సెమిస్టర్‌లో 23 మందికి 21 మంది, నాలుగో సెమిస్టర్లో 26 మందికి 26 మంది, 8వ సెమిస్టర్‌లో 24 మందికి 20 మంది ఉత్తీర్ణత సాధించారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీలో రెండో సెమిస్టర్‌లో 91 మందికి గాను 90 మంది పాసయ్యారు. నాలుగో సెమిస్టర్‌లో 92 మందికి గాను 91 మంది ఉత్తీర్ణత సాధించారు.
- ఇంజినీరింగ్ సీఎస్ఈ బ్రాంచ్‌లో నాలుగో సెమిస్టర్‌లో 66 మందికి 50 మంది, ఆరో సెమిస్టర్‌లో 70 మందికి 62 మంది, ఈసీఈ బ్రాంచ్ నాలుగో సెమిస్టర్‌లో 68 మందికి 38 మంది, ఆరో సెమిస్టర్‌లో 64 మందికి 52 మంది ఉత్తీర్ణత సాధించారు. మెకానికల్ నాలుగో సెమిస్టర్‌లో 62 మందికి 60 మంది, ఆరో సెమిస్టర్‌లో 60 మందికి 56 మంది, సివిల్ ఇంజినీరింగ్‌లో నాలుగో సెమిస్టర్‌లో 36 మందికి 34 మంది, ట్రిపుల్‌ఈ నాలుగో సెమిస్టర్‌లో 58 మందికి 54 మంది ఉత్తీర్ణత సాధించారు.
- బీఎడ్ రెండో సెమిస్టర్‌లో జిల్లాలో 14 కళాశాలల నుంచి 1031 మంది రాయగా 965 మంది ఉత్తీర్ణత సాధించారు. 93.06 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

ఖాతాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి

ఎచ్చెర్ల క్యాంపస్: స్వయం సహాయక సంఘాలు నిర్వహించే ఖాతాలు పక్కాగా ఉండాలని వెలుగు సంస్థాగత నిర్మాణం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మోహన్‌రావు అన్నారు. ఎచ్చెర్ల సాంకేతిక శిక్షణ కేంద్రంలో మంగళవారం వెలుగు క్లస్టర్, జిల్లా అధికారులకు రెండు రోజులు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామం యూనిట్‌గా ప్రతి సంఘం ఖాతాలు పరిశీలించాలన్నారు. పొదుపు, తీసుకున్న రుణం, ప్రభుత్వం ద్వారా పొందిన ప్రయోజనాలు, ఆర్థిక లావాదేవీలు పక్కాగా ఉండాలన్నారు. సంఘాల ఆర్థిక నిర్వహణ మెరుగ్గా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో వెలుగు విభాగాలు ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

బండి సంజయ్ వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ప్రజా యుద్ధనౌక గద్దర్‌పై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అవమానకరంగా మాట్లాడం సరికాదని, వెంటనే ఆ మాటలను వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని రాష్ట్ర దళిత జేఏసీ నేత కంఠ వేణు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ భావజాలం, తెలంగాణ అస్తిత్వం పేదల పక్షాన పోరాడిన వ్యక్తి గద్దర్‌పై బీజేపీకి ఎంత ద్వేషముందో సంజయ్ మాటల్ని బట్టి అర్థమవుతుందని పేర్కొన్నారు.